# నాన్న మతిమరుపు

## సి. డి. యస్. రామయ్య

నాన్న ఆఫీసునుండి వచ్చారు. దుస్తులు మార్చుకుని, ముఖం కాళ్లు కడుక్కొని, ఈజీచేరులో వచ్చి కూర్చున్నాడు. అమ్మ, కాఫీ గ్లాసును చేతబట్టుకొని ఆయనదగ్గరికి వచ్చింది. ఏదో ఆలోచనలలో వున్న నాన్న అమ్మ పలకరించే వంకూ గుర్తించలేకపోయాడు.

"కాఫీ తీసుకోండి!" అంది అమ్మ.

నాన్న తేరుకుని, కాఫీ గ్లాసును అందుకుని, నాలుగు గుక్కలు కాఫీ త్రాగి, ముఖాన్ని నాలుగు వంకలు చేసుకున్నాడు. "అబ్బబ్బ! ఏం కాఫీ నీళ్లే యివి? - దీనికంటే సొంటి నీళ్లు పెట్టివ్వరాదూ!" అన్నాడు, కాస్త కోపంతో.

"నన్నేం చేయమంటారండీ? - కాఫీపొడుం అయిపోయిందనీ, ఆఫీసునుండి వస్తూ పట్టుమ్మనీ - పొద్దుటే చెప్పానుగా! - మీరు వినిపించుకుంటేనా?" అని మూతి విరుచుకుంది అమ్మ.

నాన్న ముఖం యెర్రబారింది: "ఎప్పుడూ లేదనే పాట తప్ప, మరేం తెలుస్తుంది లే నీకు! - అంతా నా దురదృష్టం!-" అంటూ లేచాడు.

నెలాఖరు రోజులు కాబట్టి యే సంసారంలోనైనా — యిలాంటి ఘర్షణలు జరుగుతూనే వుంటాయి!

"విశ్వం! విశ్వం!!" అంటూ తమ్ముడ్ని కేకలేశాడు నాన్న. కాని, వాడు యింట్లో వుంటేనా?- ఫుట్‌బాల్ ఆడటమే వాడి ప్రతి సాయంత్రపు కార్యక్రమం.

"వాడు యిప్పుడే ఆడుకోడానికి వెళ్ళాడు నాన్నా!" అని నాన్నకు సమాధానం యిచ్చాను నేను.

"చస్తున్నవాళ్లు చస్తుంటే, ఈ వెధవకి ఆటలు కావాలిసొచ్చింది!" గొణుగుకున్నాడు నాన్న: "కాఫీ పొడుం తెప్పిద్దామనుకున్నా, మనుషులు లేరు. అన్నిటికీ నేనే తిరిగి చావాలి."

పై కండువా భుజాన వేసుకుని, డబ్బుకోసం కాబోలు — బీరువా తెరిచాడు నాన్న. అయిదు నిమిషాల పాటు బీరువా అంతా గాలించి, పిదప — "ఏమేవ్" అంటూ గట్టిగా కేకేశాడు. అమ్మ పరుగెత్తుకొచ్చింది.

"నెలాఖరున చిల్లర ఖర్చులకి యిబ్బందిగా వుంటుందని - అయిదు రూపాయలు అప్పు తీసుకొచ్చి - బీరువాలో వుంచితే కనిపించడం లేదు...నువ్వేమేనా తీశావా?" అని అడిగాడు నాన్న.

"అబ్బే! నేను చూడనైనా లేదు." అంది అమ్మ.

"ఏరా, రామం! నువ్వేమైనా చూశావా?" అని నన్నడిగాడు నాన్న.

"లేదు నాన్నా!" అన్నాను నేను.

"అయితే, యేమైనట్టు?— బీరువా తినేసిందా? లేక దొంగలెత్తుకుపోయారా? వెధవసంసారం! ఇన్నాళ్ళకి దొంగతనం జరగడం కూడా ప్రారంభమైందీ!" అంటూ పొలికేకలు ప్రారంభించాడు నాన్న.

"అలా అరవకండి దేనికండీ! పెట్టినచోటు బాగా గుర్తు చేసుకుని, వెతికి చూడండి మరి!" అంది అమ్మ.

"గుర్తేమిటే? - మహా చెప్పొచ్చావు గానీ, నోరు మూసుక్కూచో......" అని, నిమిషం తర్వాత "ఆఁ!—ఆ తుంటరిగాడే యెత్తివుంటాడు. రానీ, వాడి పని పట్టిస్తాను" అని అన్నాడు నాన్న.

"మరీ బాగుంది; వాడేం చేశాడని?" అని అడిగింది అమ్మ.

"ఏం చేశాడా! - కళ్లు మూసుకుంటే, ఈ కొంపనే ముంచేస్తాడు వెధవ! వాడి క్లాసు పుస్తకాలేవో 'సెకండ్‌హేండ్'వి దొరికాయనీ, కొనుక్కోడానికి డబ్బివ్వమనీ అడిగాడు. ఇవ్వడు లేదంటే విన్నాడూ? బీరువా వెదికి కాజేసివుంటాడు..." అంటూ కోపంగా ఈజీచేర్‌లో పడుకున్నాడు.

ఏం సమాధానం యివ్వాలో, ఏం చెయ్యాలో తోచక, అమ్మ నావేపు ఒకసారి చూసి లోపలికి వెళ్ళిపోయింది.

# ★ నాన్న మతిమరుపు ★

సంధ్యవేళ గడిచిపోయినతరువాత చెమటలుపోసిన శరీరంతో యింటి కొచ్చాడు విశ్వం. వస్తూనే చొక్కా తీసి, దండెంమీద పడేశాడు. అంతసేపూ వాడికోసం కాసుకు కూర్చున్న నాన్న - లేచి, మూరులోనున్న బెత్తాన్ని తీసుకుని వాడివద్దకు వచ్చాడు. అంతవరకూ ఆనందరేఖలు అలముకొని వున్న విశ్వం ముఖం - నాన్న రౌద్రాన్ని చూసి, పాలిపోయింది. బెదురుగా ఆయనవేపు చూశాడు.

"ఏరా, వెధవా! - బీరువాలో అయిదు రూపాయలు తీశావా లేదా?" అని అడిగాడు నాన్న.

"అదేమో - నాకు తెలీదు నాన్నా!" అన్నాడు విశ్వం, తడబడుతూ.

"తెలీదూ!" అంటూ ఛెళ్లున వాడి వీపుమీద బెత్తాన్ని మోగించాడు నాన్న: "నిజం చెప్పు వెధవా! - చర్మం వొలిచేస్తాను. తీశావా లేదా?"

"లేదు నాన్నా, నేను తీయ లేదు."

"అబద్ధాలాడుతావ్ - " అంటూ విశ్వం చేతులమీదా, కాళ్ళమీదా బెత్తంతో కొట్టసాగాడు నాన్న. అమ్మ లోపలినుండి వచ్చి నాన్నని వారించబోయింది. ఆ సందర్భంలో అమ్మకీ నాలుగు దెబ్బలు తగిలాయి. నాన్నకున్న కోపంలో, అడ్డు తగలడం అంత మంచి పని కాదని నాకు తెలుసు. కాని, తమ్ముడ్ని కొట్టడం చూసి సహించలేకపోయాను...

నాన్న కొడుతూనే వున్నాడు; విశ్వం ఒంటిమీద వాతలు పడుతున్నాయి; వాడు పెద్దగా యేడుస్తున్నాడు. నాన్నని వారించడానికి భయపడి, అమ్మ కంట నీరు పెట్టుకుంటోంది.

"నిజం చెప్పేంతవరకూ - నీ కండల్ని చీల్చేస్తాను వెధవా! - చెప్పు, నిజం చెప్పు...పుస్తకాలకి డబ్బు కావాలని, ఆ అయిదురూపాయలూ నువ్వు తీయలేదూ?" అంటూ బెదరిస్తున్నాడు నాన్న.

దెబ్బలకి భయపడిపోయాడు విశ్వం. నిజంగా తను తీయకపోయినా, డబ్బు తీశానని ఒక్క అబద్ధం చెప్పితే, దెబ్బలైనా ఆగిపోతాయనే తలపుతో "అవును నాన్నా! - తీశాను, నేనే ఆ డబ్బును తీశాను!" అని గోణిగేశాడు విశ్వం. ఇంతలో అమ్మ వాడ్ని లోపలికి లాక్కువెళ్లిపోయింది.

విశ్వంచెప్పిన ఆ సమాధానానికి నాన్న తృప్తిచెందాడు కాబోలు! బెత్తాన్ని అవతల పారేసి, ఈజీ చేరులో కూర్చోబోయాడు. ఇంతలో వీధినుండి "రామనాధం!... ఉన్నారా?" అంటూ అవధాన్లుగారు యింట్లోకి వచ్చారు. అవధాన్లుగారూ, నాన్నా - ఒకే కంపెనీలో వుద్యోగం చేస్తూన్న మిత్రులు.

విశ్వం యేడుపునుగురించి ప్రశ్నించాడు అవధాన్లుగారు. జరిగినదంతా చెప్పాడు నాన్న.

అవధాన్లుగారు - "అరెరె! - ఏంమనిషివయ్యా నువ్వు, రామనాధం! పాపం! నీ మతిమరుపుతనం వల్ల, ఏపాపమెరుగని కుర్రాడిమీద నేరంమోపి, చావమోదుతావా?-" అన్నాడు కాస్త కఠినంగా.

"ఏమిటి, నువ్వంటున్నదీ?" అని అడిగాడు నాన్న - ఆశ్చర్యంగా.

"నీ తలకాయ! - " అని కసిరాడు అవధాన్లుగారు: "మతిమరుపుతనంతో నువ్వు అయిదురూపాయల కాగితాన్ని వారపత్రికలో వుంచి, అది గమనించకుండా చదువుకోడానికి అడిగిన నాకు ఆ పత్రికని ఇచ్చేశావు! - ఇంటికి వెళ్ళి చూస్తే పత్రికలో అయిదురూపాయల కాగితం కనిపించింది. అది యిచ్చిపోడానికే వచ్చాను!" అంటూ అయిదురూపాయిల కాగితాన్ని నాన్నకిచ్చాడు.

నాన్న మాట్లాడలేదు. మతిమరుపుతనంవల్ల- తను చేసిన నేరానికీ, ఆవేశంతో ఏపాపమెరుగని విశ్వాన్ని వాతలుపడేలా కొట్టినందుకు నాన్న మనస్సు బాధపడిందికాబోలు! ఆయన కళ్ళలో నీళ్లు తిరిగాయి! ★

